క్లుప్తంగా

కలెక్టర్‌కు పలువురి శుభాకాంక్షలు



పుష్పగుచ్ఛం అందిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

తిరుపతి అర్బన్ : కలెక్టర్ వెంకటేశ్వర్ పుట్టిన రోజును పురస్కరించుకుని శుక్రవారం పలువురు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. జేసీ శుభం బన్సల్, డీఆర్‌ఓ నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవంద్రరెడ్డి ఇతర జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందించారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఐసీడీఎస్ పీడీ

తిరుపతి అర్బన్ : మహిళాభివృద్ధి , శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. నవచేతన, ఆధారశిల, స్టోరీ బుక్స్ చెందిన పలు పుస్తకాలను పీడీ వసంత బాయితో కలిసి ఆవిష్కరించారు. చదువుతోపాటు ఆటపాటలకు చెందిన ఈ పుస్తకాలను అంగన్‌వాడీ పిల్లలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

స్మార్ట్ మీటర్లతో ప్రజలపై భారం

తిరుపతి కల్చరల్ : కూటమి ప్రభుత్వం తీసుకువస్తున్న స్మార్ట్ మీటర్లతో ప్రజలపై పెనుభారం పడనుందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. రమాదేవి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు ఇష్టారాజ్యంగా పెంచుతున్నారని మండిపడ్డారు. ట్రూఅప్, సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలను బాదేస్తున్నారని విమర్శించారు. వీటికి వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. పేద వర్గాలను విద్యకు దూరం చేసేందుకే ప్రభుత్వ బడుల విలీన ప్రక్రియ చేపట్టారని ఆరోపించారు. సమావేశంలో నేతలు పుల్లయ్య, సుబ్రమణ్యం, జయచంద్ర, సాయిలక్ష్మి, వేణుగోపాల్, మాధవ్, లక్ష్మి, రవి, వెంకటేష్, శివకుమార్ పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : పేద విద్యార్థికి లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి, శ్రీనివాస సంస్థ వారు శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. కళాశాల ఫీజు చెల్లించేందుకు రూ.20వేల నగదు అందించారు. క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ చైర్మన్ ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ క్లబ్ సభ్యులు శాంతి పుట్టిన రోజును పురస్కరించుకుని విద్యార్థి రాముకు చేయూతనందించడం ఆనందంగా ఉందన్నారు. క్లబ్ ప్రతినిధులు జగన్నాథం, శాంతి నాడార్, ఆముదాల వెంకటేష్, ఈశ్వర్‌రెడ్డి, ఆర్కాట్ వరప్రసాద్, శేషాద్రి, హరినాథ్, సురేష్, ఆళ్వార్ మురళి పాల్గొన్నారు.

గంగమ్మకు సారె సమర్పణ



అమ్మవారి సేవలో భక్తులు

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మకు పద్మనాభం సామ్రాజ్యం దంపతులు శుక్రవారం భక్తి శ్రద్ధలతో సారె సమర్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు. రంగస్థలి చైర్మన్ గోపీనాథ్ రెడ్డి, సురేష్ స్వామి, ఆదిస్వామి, విక్రమ స్వామి, కేఎన్ రాజా, సుబ్బరామయ్య, సుబ్రమణ్యంరెడ్డి, పాపిరెడ్డి, రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

'పల్లెవెలుగు'లో కొళాయిలు

తిరుపతి అర్బన్: సెంట్రల్ బస్టాండ్ ప్రాంగణంలోని పల్లెవెలుగు బస్టాండ్‌లో రెండు కొళాయిలను శుక్రవారం ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్ ప్రారంభించారు. ఏడీఎం సంధ్యారాణి, కంట్రోలర్ వీఆర్ కుమార్ పాల్గొన్నారు.

మత్తుతో భవిత చిత్తు



మాట్లాడుతున్న డీఎస్పీ భక్తవత్సలం

తిరుపతి క్రైమ్ : ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ పేరిట శుక్రవారం పలు కళాశాలల్లో మత్తు వినియోగంతో వాటిల్లే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఎస్‌జీఆర్‌ఎస్ కాలేజీలో డీఎస్పీ భక్తవత్సలం, సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ మత్తుకు అలవాటు పడితే భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కోరారు. సీఐ రామకిషోర్, ఎస్ఐ లోకేష్ పాల్గొన్నారు.

వేదం.. విజయనాదం

ఒక్క నాయకుడి ఉన్నత ఆలోచన.. వందలాది మందికి వేద విజ్ఞానం అందించింది. ఒక్క పాలకుడి సానుకూల దృక్పథం.. యువత భవితకు దిశానిర్దేశం చేసింది. ఒక్క దార్శనికుడి ఆలోచనా విధానం.. వేలాది మందికి భారత సంస్కృతి విశిష్టతను విడమర్చి చెప్పింది. 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తిరునగరి ఖ్యాతి ఇనుమడించేలా శ్రీకారం చుట్టిన వేద విశ్వవిద్యాలయం నేడు ఇంతింతై వటుడింతై అన్నట్లు రెండు దశాబ్దాలను పూర్తి చేసుకుంది.

- దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ చలువతో వేదిక్ వర్సిటీ
- నేడు వేదిక్ వర్సిటీ 20వ వ్యవస్థాపక దినోత్సవం





ఎస్వీ వేద విశ్వ విద్యాలయం పరిపాలనా భవనం , వర్సిటీ ప్రారంభోత్సవ సభలో ప్రసంగిస్తున్న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి (ఫైల్)

తిరుపతి సిటీ : వేద విద్యను విస్తృతం చేసి వేదాల సారాంశాన్ని, జ్ఞానాన్ని భవిష్యత్ తరాలకు అందించాలనే లక్ష్యంతో ప్రత్యేక యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆలోచించారు. ఇందులో భాగంగా టీటీడీ ఆధ్వర్యంలో వేద పండితులు, పీఠాధిపతులు సలహాలతో అలిపిరి జూపార్క్ రోడ్డు సమీపంలో శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం నెలకొల్పారు.

19 విభాగాలలో..

వర్సిటీ ఏర్పాటు చేసిన తొలి ఏడాది నుంచి దేశంలోని పలు రాష్ట్రాల నుంచి వేద విద్యను అభ్యసించేందుకు వందల సంఖ్యలో విద్యార్థులు వేదిక్ వర్సిటీలో అడ్మిషన్లు పొందారు. ప్రస్తుతం సుమారు 19 విభాగాలలో వర్సిటీ వేద విద్యను అందిస్తోంది. వేద విభాగంలో రుగ్వేద, కృష్ణ యజుర్వేద, శుక్ల యజుర్వేద, సామవేద, అదర్వణ వేదం, ఆగమ శాస్త్ర విభాగాలలో వైఖానస, పంచరాత్ర, శైవాగమం, పౌరోహిత్యం విభాగాలలో ఆశ్వాలయన, అపస్తంభ, పరస్కర, వేద భాష్యంలోని 5 విభాగాలలో, కల్ప, మీమాంస విభాగాలలో 15 చొప్పున అడ్మిషన్లు చేపట్టి నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులలో ప్రతి ఏడాది ఒక్కో విభాగంలో ప్రత్యేక నిపుణులైన వేద పండితులతో శిక్షణ ఇస్తున్నారు. సంస్కృత పరిజ్ఞానం కలిగిన విద్యార్థులకు ఏడు విభాగాలలో సర్టిఫికెట్ కోర్సులను సైతం వర్సిటీలో అందుబాటులోకి తీసుకువచ్చారు.

ఉపాధి కల్పనే లక్ష్యంగా అడుగులు

వేదిక్ వర్సిటీలో విద్యనభ్యసించి పీజీ, యూజీ, పీహెచ్‌డీ పూర్తి చేసిన విద్యార్థులకు వంద శాతం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. దేశ, విదేశాలలోని పలు ఆలయాలలో పండితులు, పూజారులుగా, సలహాదారులుగా వందల మంది వర్సిటీ విద్యార్థులు ఉన్నత స్థాయిలో పనిచేస్తున్నారు. టీటీడీ విద్యాసంస్థలలో అధ్యాపకులుగా, ఆలయాలలో పండితులుగా రాణిస్తున్నారు. అలాగే అయోధ్యలోని రామాలయంలో సైతం వేదిక్ వర్సిటీ విద్యార్థులు ఉన్నత స్థానాలలో పనిచేస్తుండటం గర్వకారణంగా చెప్పవచ్చు

నేడు వర్సిటీ 20వ వ్యవస్థాపక వేడుకలు

టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసి 20 ఏళ్లు నిండిన సందర్భంగా శనివారం వర్సిటీలోని సంధ్యావందన శాలలో వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా జరపనున్నారు. వీసీ రాణి సదాశివమూర్తి అధ్యక్షతన రిజిస్ట్రార్ భాస్కరుడు పర్యవేక్షణలో నిర్వహించనున్న వ్యవస్థాపక దినోత్సవానికి టీటీడీ అధికారులు, బోర్డు సభ్యులు హాజరుకానున్నారు.

ఘనంగా జనాభా దినోత్సవం



ఎస్వీయూలో మాట్లాడుతునన సాయి సుజాత

తిరుపతి సిటీ : పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శుక్రవారం ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్విమ్స్ డైరెక్టర్ ఆర్‌వీ కుమార్ మాట్లాడుతూ జనాభా పెరుగుదల, పర్యవసానాలపై ప్రజలలో పూర్తి స్థాయి అవగాహన అవసరమన్నారు. ప్రిన్సిపల్ నారాయణమ్మ మాట్లాడుతూ జనాభా నియంత్రణపై ప్రజలు దృష్టి సారించాలని కోరారు. వైద్యకళాశాల ప్రిన్సిపల్ ఉషాకళావత్, డాక్టర్లు నాగరాజు, భవానీ, ప్రవల్లిక సుధారాణి, ఉమారాణి పాల్గొన్నారు.

ఎస్వీయూలో..

ఎస్వీయూలో ప్రొఫెసర్ సాయి సుజాత మాట్లాడుతూ ప్రపంచ జనాభా దినోత్సవ లక్ష్యంపై అవగాహన కల్పించారు. ప్రొఫెసర్లు చంద్రశేఖర్, భాస్కర్ రెడ్డి, సెట్విన్ సీఈఓ మోహన్ కుమార్, సైకియాట్రిస్ట్ ఓవీ రెడ్డి, అధ్యాపకులు సునీల్ కుమార్, రీనా, కోదండ రామిరెడ్డి, శివప్ప, పార్థసారథి, వెంకటయ్య, రవి బాబు పాల్గొన్నారు.

20న తిరుపతిలో ఓపెన్ చెస్ టోర్నీ

తిరుపతి తుడా : ప్రపంచ చదరంగ దినోత్సవం సందర్భంగా తిరుపతి జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన మెడికల్ కాలేజీ నందు ఓపెన్ చెస్ టోర్నీ జరగనుంది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం తుడా చైర్మన్, చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాలర్స్ దివాకర్ రెడ్డి ఆవిష్కరించారు. జిల్లాకు చెందిన క్రీడాకారులు, అన్ని వయస్సుల స్త్రీ, పురుషులు పాల్గొనవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా చెస్ అసోసియేషన్ ప్రతినిధులు, బాలాజీ చౌదరీ, శ్రీనివాస సూరి పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 63,473 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఆక్రమణల తొలగింపులో హైడ్రామా



కాలువ భూమిలో అక్రమంగా కట్టిన నిర్మాణాలను తొలగిస్తున్న దృశ్యం



కట్టడాల తొలగింపునకు వచ్చిన పోలీసులు, రెవెన్యూ అధికారులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములు, మఠం భూములు కబ్జా దారులు తమ చేతుల్లోకి తీసుకుని అక్రమంగా కట్టడాలు నిర్మిస్తుంటే ఎలాగూ అడ్డుకోలేని అధికారులు.. ఆక్రమణల తొలగింపు విషయంలోనూ హైడ్రామాకు తెరలేపారన్న విమర్శలు వస్తున్నాయి. తిరుపతి రూరల్ మండలం అవిలాల గ్రామ రెవెన్యూ సర్వే నంబరు 146లోని 0.57 ఎకరాలు కాలువ భూమి (వాగు)ని కొంత మంది భూ ఆక్రమణ దారులు కబ్జా చేసి అక్రమంగా కట్టడాలు నిర్మించారు. ఆ కాలువ భూమికి ఆనుకుని ఉన్న మఠం భూములు (సర్వే నంబరు 147, 145) సైతం ఆక్రమణలకు గురవడంతో అవిలాల గ్రామస్తులు ఉన్నతాధికారులకు వరుసగా ఫిర్యాదులు చేస్తూ వచ్చారు. ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు ఆక్రమిత భూమిలో అక్రమ కట్టడాలను తొలగించాలని కబ్జా దారులకు ఇదివరకే నోటీసులు జారీ చేశారు. అయినా సరే కబ్జా దారులు లెక్క చేయకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, తిరుపతి రూరల్ తహసీల్దారు రామాంజులనాయక్‌లతో పాటు మఠం అధికారులు శుక్రవారం ఆక్రమిత భూముల వద్దకు చేరుకున్నారు. ముందుగా సర్వే నంబరు 146లోని కాలువ భూమిలో నిర్మించిన ప్రహరీని కొంత భాగం తొలగించగా, అక్రమ కట్టడాలను తొలగించే ప్రయత్నం చేయగా కబ్జాదారులు అడ్డుకున్నారు. పోలీసులు వారిని వారించే ప్రయత్నం చేయగా కోర్టు నుంచి తమకు స్టేటస్ కో ఉందని పలు డాక్యుమెంట్లను అధికారులకు అందజేశారు. ఆ డాక్యుమెంట్లను పరిశీలించిన రెవెన్యూ, పోలీసు అధికారులు అక్రమ కట్టడాల తొలగింపును అర్ధాంతరంగా నిలిపివేశారు. కాలువ భూమిలోని కట్టడాలను పూర్తిగా తొలగించకుండానే వదిలేయడం, దానికి ఆనుకుని ఉన్న మఠం భూముల జోలికి వెళ్లకుండా వెనుదిరగడంతో రకరకాలుగా ఆరోపణలు చేస్తున్నారు. అధికార పార్టీ నేతల నుంచి ఒత్తిళ్లు రావడంతోనే అధికారులు అర్ధాంతరంగా వదిలేసి వెళ్లారనే విమర్శలు చేస్తున్నారు.

నిబంధనలు పాటించాం

ఆక్రమిత కాలువ భూమిలోని ప్రహరీ నిర్మాణం కూల్చివేయడంతో పాటు అక్రమ కట్టడాలు కడుతున్న వారికి ఇప్పటికే నోటీసులు జారీ చేసినా ఆపకపోవడంతో కొంత వరకు కూల్చివేశామని ఆర్డీఓ రామ్మోహన్ తెలిపారు. మఠం భూముల్లోని అక్రమ కట్టడాలపై కోర్టు స్టేటస్ కో ఇచ్చినందున వాటి జోలికి వెళ్లలేదన్నారు. అయితే అక్రమ నిర్మాణాల ఫొటోలు తీయించి ఇప్పుడున్న యథాస్థితిని అలాగే ఉంచాలని చెప్పామని వివరించారు. అలాకాదని అక్రమార్కులు అదనపు నిర్మాణాలు చేస్తే కచ్చితంగా వాటిని తొలగిస్తామని ఆర్డీఓ తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని ఆందోళన



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘం నేతలు

తిరుపతి అర్బన్ : ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి మండిపడ్డారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద ఫీజురీయింబర్స్‌మెంట్ వెంటనే ఇవ్వాలంటూ విద్యార్థులతో కలసి మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 6400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాల్సి ఉందని డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఫీజురీయింబర్స్‌మెంట్ కోసం కేటాయించిన నిధులు ప్రకటనలకే పరిమితం అయ్యిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువులను దూరం చేస్తున్న జీవో 77ను వెంటనే రద్దు చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఫీజురీయింబర్స్‌మెంట్‌పై కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో నేతలు ఉదయ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, మహేష్, ముని, చందు, హరికృష్ణ,మోహన్, వినయ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పురోగతిపై సమీక్ష

తిరుమల : తిరుమలలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై శుక్రవారం అన్నమయ్యభవన్‌లో టీటీడీ ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ వెంకయ్యచౌదరి సమీక్షించారు. భక్తులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా నిర్దేశిత గడువులోపు పనులను పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జేఈఓ వీరబ్రహ్మం, సీవీఎస్ఓ మురళీ కృష్ణ, డీఎఫ్ఓ ఫణి కుమార్ నాయుడు, సీఈ సత్యనారాయణ, ట్రాన్స్‌పోర్ట్ అండ్ ఐటీ జీఎం శేషారెడ్డి, ఎస్టేట్ ఆఫీసర్ వేంకటేశ్వర్లు, టౌన్ ప్లానింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అధికారి రాముడు, డిప్యూటీ ఈఓలు భాస్కర్, సోమన్నారాయణ పాల్గొన్నారు.

వంచనతోనే బాబు పాలన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి తదితరుల

తిరుపతి మంగళం : ఎన్నికల సమయంలో నోటికి వచ్చిన అబద్ధాలు వల్లించిన చంద్రబాబు ఏడాదిగా వంచనతోనే పాలన సాగిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం పద్మావతి పురంలోని పార్టీ కార్యాలయంలో నగర పడమటి విభాగం నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో పోస్టర్ ఆవిష్కరించారు. జగనన్న ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వ మోసాలను వివరించేలా రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళదామని పిలుపునిచ్చారు. పోస్టర్‌లోని క్యూ ఆర్ కోడ్‌ను ప్రతి ఒక్కరూ స్కాన్ చేసుకోవాలని కోరారు. ఇచ్చిన హామీల కంటే అధికంగా రూ.3లక్షల కోట్ల సంక్షేమ పథకాలను పేదలందరికీ అందించిన గొప్ప నేత జగనన్న అని కొనియాడారు. అంతకు మించి పథకాలు అందిస్తామని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఏడాదిగా ఒక్కటి కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. చంద్రబాబుకు వంచించడం వెన్నతో పెట్టిన విద్య అని స్పష్టం చేశారు. ప్రజలకు గ్యారంటీగా పథకాలు అందిస్తామని షూరిటీ బాండ్లు ఇచ్చిన మోసం చేశారని ఆరోపించారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అధికారం కోసం చేసిన ద్రోహాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని సూచించారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, కార్పొరేటర్లు బసవ గీత, ఆదిలక్ష్మి, నేతలు తొండమనాటి వెంకటేష్‌రెడ్డి, సయ్యద్ షఫీ అహ్మద్ ఖాదరీ, కట్టా గోపీయాదవ్, పెరుగు బాబూ యాదవ్, ఇమ్రాన్‌బాషా, దినేష్‌రాయల్, మద్దాలి శేఖర్, చక్రవర్తి, సురేష్‌రాయల్, లక్ష్మీ వెంకటేష్, చింతా రమేష్, గీతాయాదవ్, నయనార్ మధుబాల, విజయలక్ష్మి, పసుపలేటి సురేష్, రమణారెడ్డి పాల్గొన్నారు.

కందారపు రాజమ్మకు నివాళి



నివాళులర్పిస్తున్న అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : సీపీఎం నేత కందారపు మురళి మాతృమూర్తి కందారపు రాజమ్మ శుక్రవారం కన్నుమూశారు. విషయం తెలిసిన వెంటనే వైఎస్సార్ సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి స్థానిక సుందరయ్యనగర్‌లోని వారి నివాసానికి వెళ్లారు. రాజమ్మ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబీకులను పరామర్శించారు.

పచ్చమూక బాధితులకు పరామర్శ

- ధైర్యం చెప్పిన మోహిత్‌రెడ్డి
- అండగా ఉంటామని భరోసా



సర్పంచ్ భారతి కుటుంబీకులను పరామర్శిస్తున్న మోహిత్‌రెడ్డి



అజయ్ కుమార్, ప్రవీణ్‌కుమార్‌తో మాట్లాడుతున్న మోహిత్‌రెడ్డి



శశిధర్‌రెడ్డికి ధైర్యం చెబుతూ...

తిరుపతి రూరల్ : టీడీపీ గూండాల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నేతలను పార్టీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. చంద్రగిరి మండలం పనపాకం దళితవాడకు చెందిన అజయ్ కుమార్, నరసింగాపురానికి చెందిన ప్రవీణ్‌కుమార్, ముంగిలిపుట్టు సర్పంచ్ భారతి కుటుంబీకులను మోహిత్‌రెడ్డి నేరుగా కలిసి మాట్లాడారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయ కక్షలతో భౌతిక దాడులు చేసిన వారికి వడ్డీతో సహా చెల్లించే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. బాధిత కుటుంబాలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తాను అండగా నిలబడతానని భరోసా ఇచ్చారు. క్యాడర్‌ను కాపాడుకునేందుకు ఎంత వరకైనా వెళతానని, భవిష్యత్‌లో ఇలాంటివి జరిగితే ఆందోళనలను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. నిందితులను శిక్షించేంత వరకు పోరాడతానని హామీ ఇచ్చారు.

మరీ ఇంత రాక్షసత్వమా..?

జగనన్న పర్యటనలో పార్టీ కార్యకర్తలపై పోలీసులు లాఠీ చార్జీ చేయడాన్ని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తప్పు బట్టారు. పోలీసుల లాఠీ చార్జిలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి శశిధర్‌రెడ్డిని పరామర్శించారు. లింగేశ్వర నగర్ లోని శశిధర్‌రెడ్డి ఇంటికి వెళ్లి ధైర్యం చెప్పారు.

నోటీస్ బోర్డు

- శ్రీగోవిందరాజస్వామివారి ఆలయ తిరుమాడ వీధుల్లో ఉదయం 4.45 గంటలకు నగర సంకీర్తన.
- పెరుమాళ్లపల్లెలోని శ్రీబాలాజీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఉదయం 9 గంటలకు సూపర్ స్పెషాలిటీ వైద్యశిబిరం, పింక్ బస్సు ద్వారా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు.
- తిరుపతిలోని నార్త్, ఈస్ట్, సౌత్ సెక్షన్లు, రాజీవ్‌నగర్, అవిలాల సెక్షన్లలోని వివిధ ఫీడర్లలో విద్యుత్ మరమ్మత్‌లు, చెట్లకొమ్మలు తొలగింపు కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్‌కు అంతరాయం.
- చంద్రగిరి మండలంలో మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం.
- కచ్చపి ఆడిటోరియంలో సాయంత్రం 5.30 నుంచి 8.30 గంటల వరకు గజల్ శ్రీనివాస్ రూపొందించిన శ్రీమద్భగవద్గీతను శ్రీవారికి బహూకరణ,అష్టలక్ష్మీ వైభవం నృత్య ప్రదర్శన.
- అప్పలాయిగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పుష్పయాగం.
- తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో సాయంత్రం 6.45 గంటలకు గజవాహన సేవ.
- శ్రీకోదండరామాలయంలో ఉదయం 6 గంటలకు స్వామివారికి అభిషేకం, సాయంత్రం 5 గంటలకు సీతారామలక్ష్మణుల ఊరేగింపు.
- బైరాగిపట్టెడలోని గిరిజన భవన్‌లో ఉదయం 11 గంటలకు రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్ పోటీలు ప్రారంభం.

నేత్రదానం



కందారపు మురళికి సర్టిఫికెట్ అందిస్తున్న వైద్యులు

తిరుపతి తుడా : స్విమ్స్ ఆస్పత్రిలో శుక్రవారం కన్నుమూసిన కందారపు రాజమ్మ (80) నేత్రాలను ఆమె కుటుంబీకులు దానం చేశారు. కుమారులు కందారపు మురళి, కందారపు మోహన్ తమ తల్లి నేత్రాలను రుయా ఆస్పత్రికి విరాళంగా అందించారు. ఈ మేరకు వారిని సూపరింటెండెంట్ రాధ అభినందించారు. డాక్టర్ చలపతి రెడ్డి అధ్వర్యంలో నేత్రాలను సేకరించారు.

'పురమిత్ర'తో ఇంటి వద్దకే సేవలు

తిరుపతి తుడా : మున్సిపల్‌శాఖ ప్రవేశపెట్టిన పురమిత్ర యాప్ ద్వారా ఇంటి వద్దకే సేవలు అందుబాటులోకి వస్తాయిన కార్పొరేషన్ కమిషనర్ మౌర్య తెలిపారు. శుక్రవారం తిరుమలరెడ్డి నగర్‌లో చేపట్టిన ఇంటింటి సర్వేను ఆమె పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. నగరవాసుల స్థితిగతులు తెలుసుకునేందుకే సర్వే చేపట్టినట్లు వెల్లడించారు. ఈ మేరకు గుర్తించిన పేద కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని వివరించారు. అలాగే పురమిత్ర యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ట్రైనీ కలెక్టర్ రఘువంశీ, డిప్యూటీ కమిషనర్ అమరయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్‌స్టాండ్ తనిఖీ

పాకాల : స్థానిక ఆర్టీసీ బస్‌స్టాండ్‌ను తిరుపతి రీజనల్ మేనేజర్ జగదీష్ శుక్రవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా బస్సు రూట్ చాట్‌ను పరిశీలించారు. బస్‌స్టాండ్ కంట్రోలర్ రవిచంద్రను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. తిరుపతి డీఎం బాలాజీ మాట్లాడుతూ బస్‌స్టాండ్ ఆవరణలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న దుకాణాలకు నోటీసులు జారీ చేసి లైసెన్స్‌లు రద్దు చేయాలని ఆదేశించారు.

ఘనంగా ఉరుసు

పాకాల : పాకాలలో 105వ హజరత్ షేక్ ఫరీద్ మస్తాన్ ఔలియా వారి ఉరుసును ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం దర్గా వద్ద అన్నదానం చేపట్టారు. రాత్రి 9 గంటలకు బెంగళూరు, నాగపూర్, ముంబాయి నుంచి వచ్చిన గాయకులతో కవ్వాలీ ఏర్పాటు చేశారు. కులమతాలకు అతీతంగా నిర్వహించిన ఉరుసును జయప్రదం చేసిన ప్రజలకు దర్గా కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

దుకాణాల తనిఖీ



షాపును తనిఖీ చేస్తున్న సీఐ సుదర్శన్ ప్రసాద్

పాకాల : పాఠశాలలకు సమీపంలో నిర్వహించే దుకాణాలను పోలీసులు శుక్రవారం తనిఖీ చేశారు. సీఐ సుదర్శన్ ప్రసాద్ మాట్లాడుతూ బడుల వద్ద షాపుల్లో మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

జనాభా నియంత్రణపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది

తిరుపతి తుడా : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జనాభా నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి నగరంలోని పలు వీధులలో నిర్వహించిన ఈ ర్యాలీలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలక్రిష్ణ నాయక్ పాల్గొని ప్రసంగించారు. ప్రణాళికా బద్ధమైన మాతృత్వం, గర్భధారణల మధ్య ఆరోగ్యకరమైన సమయం అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు జిల్లా అంతటా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సరైన వివాహ వయస్సు, యుక్త వయస్సులో గర్భధారణ వలన కలిగే అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ర్యాలీలో డీపీఎంఓ డాక్టర్ శ్రీనివాసరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ సెల్వియా, డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ హరిత, వైద్యాధికారులు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.